
ధనలక్ష్మి

● రూ.1.24 కోట్లతో అమ్మవారి అలంకరణ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారిని రూ.1.24 కోట్ల నగదుతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



కరెన్సీ నోట్లతో అలంకరించిన అమ్మవారు

గరిష్టం/కనిష్టం
37/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అర్హులైన రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో అర్హులైన రైతులందరికీ మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందజేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత సూక్ష్మ సేద్యం, పరికరాల కోసం ఆసక్తి చూపుతున్న రైతుల వివరాలను ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 24 వేల మంది రైతులు మైక్రో ఇరిగేషన్ పరికరాల కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే రాయితీ పోను తమ వాటా డబ్బులు చెల్లించిన రైతులకు సంబంధించి 2006 హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందించేలా సంబంధిత కంపెనీలకు అనుమతి ఇచ్చామని వివరించారు. స్పందించిన కలెక్టర్ ఆసక్తి చూపుతున్న రైతులంతా త్వరగా వారి వాటా నగదును చెల్లించేలా చూడాలన్నారు. అవసరమైన పరిపాలన అనుమతులు త్వరగా ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైక్రో ఇరిగేషన్ సాగుకు ఎక్కువ అవకాశం ఉన్న జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరికరాలు సరఫరా చేసే కంపెనీలు కూడా రైతులకు నాణ్యమైనవి అందజేయాలన్నారు. సకాలంలో రైతులకు అందించడం, అనంతరం అవసరమైన సేవలను కూడా అందిచాలన్నారు. దీనిలో ఏపీఎంఐపీ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

29న ముసాయిదా ఓటర్ల జాబితా

● డీఆర్‌ఓ శ్రీలత




రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ఈ నెల 29వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉందని, ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు వరకు వచ్చిన దరఖాస్తులను రెండు రోజుల్లో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత అధికారులకు సూచించారు. ముసాయిదా జాబితా ప్రచురణ నేపథ్యంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రకాశం భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించడంతో పాటు నిర్మాణ పనులు చేపడుతున్న పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, పేరు మార్పులపై చర్చించారు. జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, ఒంగోలు, కొండపి, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి ఈఆర్‌ఓలు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజశేఖర్ పరిస్థితి విషమం

● గుంటూరు తరలింపు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజశేఖర్

ఒంగోలు టౌన్: ఆర్థిక లావాదేవీల విషయంలో టూ టౌన్ పోలీసుల చేతిలో థర్డ్ డిగ్రీకి గురై అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడిన పరుచూరి రాజశేఖర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు జీజీహెచ్ నుంచి గుంటూరుకు తరలించారు. నిన్నటి వరకు నిలకడగా ఉన్న ఆయన ఆరోగ్యం శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా క్షీణించింది. వరుసగా వాంతులు కావడంతో పాటుగా , రక్తపోటు హెచ్చు తగ్గులు చూపించడం మొదలైంది. దాంతో మెరుగైన చికిత్స కోసం వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు రాజశేఖర్ కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపట్నం మండలం వింటాస్ మేనేజర్‌గా పనిచేసిన ఆయన కంపెనీకి చెందిన నిధులు దుర్వినియోగం చేసినట్లు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం పిలిపించిన టూ టౌన్ పోలీసులు నేరం ఒప్పుకోమంటూ ఒత్తిడి చేయడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించి చితకబాదారని ఆరోపించడం తెలిసిందే. ఈ క్రమంలో అవమానంగా భావించిన రాజశేఖర్ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు.



ఒంగోలు చర్చి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి, నాయకులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని, పక్కన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేదికపై బూచేపల్లి వెంకాయమ్మ, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, తాటిపర్తి చంద్రశేఖర్, జూపూడి ప్రభాకర్‌రావు, అన్నా రాంబాబు తదితరులు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఐక్యంగా ఉండి..

కూటమిని తరిమికొట్టండి

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి పేర్ని నాని పిలుపు

- కార్యకర్తల్లో ఉప్పొంగిన నూతనోత్సాహం
- జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- చర్చి సెంటర్ నుంచి వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సభకు హాజరైన కార్యకర్తల్లో ఒక భాగం

సాక్షి ప్రతినిధి ఒంగోలు/ఒంగోలు సిటీ: గ్రూపు వివాదాలకు స్వస్తి పలికి నాయకులు, కార్యకర్తలంతా చేయి, చేయి కలిపి ఏకతాటిపైకి వచ్చి కూటమి వారిని తరిమికొట్టాలని మాజీ మంత్రి పేర్ని నాని పిలుపునిచ్చారు. మనింటి వంక, మన బజారు వంక కన్నెత్తి చూడడానికి భయపడే పరిస్థితి రావాలని కోరారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చారు. నగరంలో పార్టీ నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బూచేపల్లి నేతృత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాని అన్నారు. గ్రామ స్థాయి నుంచి నాయకులందరూ గ్రూపులు మాని ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. జిల్లాలో మనకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. జగన్ జెండా మోసే కార్యకర్తలే వారి ధైర్యం.. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం.. శివప్రసాద్ నాయకత్వంలో 8 సీట్లు గెలిచేలా కృషి చేయాలన్నారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న తప్పుడు పనులను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. జగన్ దగ్గర అధికారంలేదు కానీ మేమంతా ఉన్నామని శత్రువులకు చెప్పేందుకు ఇక్కడకు వచ్చామన్నారు.

జగన్ ఏనాడూ జనాన్ని మోసం చేయలేదు

''జనాల్ని మాయ చేయడం కోసం, జనాన్ని లోబర్చుకోవడం కోసం జగన్ ఏరోజూ గోవురంగు పంచెకట్టలేదు.. ఎర్రలుంగీ కూడా కట్టలేదు.. ఏరోజు నాకు మతంలేదు..నాకు కులం లేదు అని మొన్న చెప్పి.. ఇవాళ నాకు కులం ఉంది..మతం ఉంది అని చెప్పి డ్రామా మాటలు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడడం లేదని'' మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ''జగన్‌మోహన్‌రెడ్డి జనానికి మేలు చేయాలన్న విపరీతమైన ఆకాంక్షతో కార్యకర్తలకు అన్యాయం జరిగిందన్న మాట వాస్తవం.. నాలాంటి వాళ్లు వస్తుంటారు..పోతుంటారు..జగన్‌ను జాగ్రత్తగా చూసుకోండి..కష్టాన్ని దిగమింగండి'' అని కార్యకర్తలకు సూచించారు. మిషన్లు నమ్ముకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను వెంటాడి, వేటాడే పనిలో ఉందని విమర్శించారు. కూటమి కార్యకర్తలకు చెబుతున్నాం.. మీ ఆటలు ఒకటి రెండు నెలలు మాత్రమే..ఆరు నెలల తర్వాత మా పార్టీ జెండా మోసేవాళ్లు తిరగబడడం మొదలు పెడితే చెట్టుకొకడు..పుట్టకొకడు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి అధికారం పోయాక పోటు పొడిచివెళ్లే తత్వం జెండా మోసిన కార్యకర్తలు, నాయకులకు లేదన్నారు. రానున్న రోజుల్లో మీరు జగన్‌ను అధికారంలోకి తీసుకురావడం ఖాయం..ఆయన మీ రుణం తీర్చుకోవడం ఖాయమని చెప్పారు. తిరుపతి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిసిందని వాళ్లలా తప్పుడు మాటలు చెప్పాల్సిన పనిలేదన్నారు.

■ తిరుపతి లడ్డూ కల్తీ వివాదానికి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

జిల్లాలో ప్రతి ఒక్క కార్యకర్తకూ నాయకులమంతా అండగా ఉంటామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. పదవి ఉన్నా..లేకపోయినా మా జీవితం మొత్తం జగన్‌మోహన్‌రెడ్డికి అంకితమన్నారు. 2009 నుంచి జగన్ వెంటే ప్రయాణం చేస్తున్నామని చెప్పారు. బూచేపల్లి కుటుంబం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, జగన్ మోహన్‌రెడ్డికి వీర విధేయతగా ఉంటామన్నారు. ఇది ముళ్ల కిరీటం కాదని, పూలకిరీటం అన్నారు. జగన్ ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడతానని చెప్పారు. జిల్లాలో నాయకులందరి సలహాలు, సూచనలు తీసుకుని జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కార్యకర్తలను ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందన్నారు. అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజు వచ్చిందన్నారు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ జగన్ సీఎం అవుతారన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షునిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టే ముందు లాయర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో, కోర్టు సెంటర్‌లోని అంజనేయస్వామి వారి ఆలయంలో, వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చర్చి సెంటర్ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు.

■ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఒక్క రూపాయి కన్నా రూపం గొప్పదన్నారు. లక్షల కన్నా లక్షణం గొప్పదని, కోట్ల కన్నా కొనలేని అభిమానం గొప్పదని కొనియాడారు. ఎగిరింది ఎగిరింది వైఎస్సార్‌సీపీ జెండా, వినీలాకాశంలో ఎదురు లేకుండా, ఆంధ్రావని ప్రజల అండతో 2029 లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

■ మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని నియమించడంతో, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జిల్లాకు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అనేక గొప్ప సంస్కరణలు చేసి ప్రజల బాగోగులు, కష్టాలు, వెతలు తీర్చిన పరిస్థితిని మర్చిపోలేమన్నారు.

■ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో 8 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు శక్తి యుక్తులతో కృషి చేయాలన్నారు.

■ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పథంలో దూసుకెళుతుందన్నారు. కనిగిరిలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు వెళతామన్నారు.


■ మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వయస్సులో చిన్నవాడు కానీ, రాజకీయంలో కాదన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని నాయకులకు, కార్యకర్తలకు ఒక భరోసా కల్పించే వ్యక్తి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. రెడ్‌బుక్ పేరుతో పోలీసులను లోబరుచుకొని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వివక్షతకు గురి చేస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. 2029 లో ప్రతి కార్యకర్త చేతిలో బ్లూబుక్ ఉంటుందని, ప్రతి గ్రామానికి ఒక బ్లూబుక్ పెడతామన్నారు.

■ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గడ్డ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అడ్డా అని అన్నారు. జగనన్నకు మనమంతా సైనికులం, ప్రజలందరికీ సేవకులమన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయాలంటే శివన్న ఒక్కడికే సాధ్యమన్నారు. ఈ రాష్ట్రంలో కూటమి వేళ్ల పెకలించాలని, ఎర్రబుక్ కాదు అది ఎర్రిబుక్ అని ఎద్దేవా చేశారు.

■ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేంత వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాసరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, కొమ్మూరి కనకారావు, కుప్పం ప్రసాద్, కాకుమాను రాజశేఖర్, కఠారి శంకర్, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మాదాసు వెంకయ్య, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి (బన్నీ), లంకపోతు అంజిరెడ్డి, వాకా బసివిరెడ్డి, బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావు, ఆళ్ల రవీంద్రారెడ్డి, షేక్ సుభాని, డి.కుమారలక్ష్మి, టి.మనోజ్‌కుమార్, రాచగొర్ల వెంకట సుశీల, చుండూరి రవిబాబు, కె.వి.రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఇనగంటి పిచ్చిరెడ్డి, బంగారుబాబు, జిల్లా జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జిల్లా జెడ్పీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు కల్తీ దెబ్బ



పవిత్రమైన తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ కల్తీ అయిందంటూ అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నేతలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు వంటిదని ప్రజలు అంటున్నారు. రాజకీయ దురుద్దేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీం కోర్టు రద్దు చేసి తిరుమల కల్తీ లడ్డూ వివాదంపై సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్‌తో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించడం కూటమి ప్రభుత్వానికి భంగపాటు అని అభిప్రాయపడుతున్నారు. నిష్పక్షపాతమైన విచారణతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని..కూటమి నేతల దుష్ప్రచారంలో నిజమెంతో నిగ్గుతేలుతుందని అంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ



తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డు విషయంలో సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పడం అందరూ ఆమోదించతగ్గ విషయం. తిరుమల లడ్డు పై దుష్ప్రచారం చేసిన ప్రభుత్వానికి ఇది గట్టి ఎదురు దెబ్బే. చంద్రబాబే దుష్ప్రచారం చేసి ఆయనే సిట్ ఏర్పాటు చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి లడ్డూ వివాదం తెర పైకి తెచ్చి భంగపడ్డారు. నిజా నిజాలు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి అనుగ్రహంతో కచ్చితంగా బయటకు వస్తాయి.

– **బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి**, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే

బాబు పాలనకు ఇది చెంపపెట్టు



తిరుపతి లడ్డు వ్యవహారంపై సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో సిట్ వేయడం సీఎం చంద్రబాబు పాలనకు చెంపపెట్టు లాంటిది. చంద్రబాబు వేసిన సిట్‌ను రద్దు చేయడం ఆయన పాలనా వైఫల్యానికి నిదర్శనం. దేవుడిని అడ్డం పెట్టుకుని చంద్రబాబు తన వంద రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేయటానికి నీచ రాజకీయానికి పాల్పడిన బాబు చివరికి తాను తీసుకున్న గోతిలో తానే పడ్డాడు. జగనన్న కడిగిన ముత్యంలా ప్రజల ముందు నిలిచే రోజు, కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినటానికి కారణమైన చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చేరోజు కూడా దగ్గరలోనే ఉంది. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగిన బాబు అయిన, సనాతన ధర్మమని హడావుడి చేస్తున్న వారు కూడా ఆ దేవదేవుని శిక్షకు గురికావాల్సిందే. కలియుగదైవం వెంకటేశ్వరస్వామిని తన రాజకీయ లబ్ధి కోసం వాడుకోవటం దుర్మార్గం. ఇందుకు చంద్రబాబు ప్రాయశ్చిత్తంగా తక్షణమే రాజీనామా చేయాలి.

– **డాక్టర్ ఆదిమూలపు సురేష్**, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి

స్వార్థ రాజకీయాలతోనే లడ్డుపై దుష్ప్రచారం



తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ కూటమి ప్రభుత్వం చేసిన దుష్ప్రచారంపై సుప్రీం కోర్టు సీబీఐ డైరక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిది. కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనాలకే చంద్రబాబు, కూటమి నేతలు లడ్డు పై దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు ప్రజల దృష్టిని మళ్లించేందుకు లడ్డు వివాదాన్ని రేపి భంగ పడ్డారు.

– **దద్దాల నారాయణ యాదవ్**, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి

ప్రజల దృష్టి మళ్లించేందుకే లడ్డు వివాదం



వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు టీటీడీ లడ్డు కల్తీ జరిగిందంటూ దుష్ప్రచారం చేశారు. సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం ప్రభుత్వానికి చెంప పెట్టుగా మారింది. కల్తీ లడ్డు వ్యవహారంలో చంద్రబాబు, కూటమి నేతలు భంగపాటుకు గురయ్యారు. ఇది చంద్రబాబుకు గట్టి దెబ్బ.

– **వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ)**, పీడీసీసీబీ మాజీ చైర్మన్

లడ్డుపై సుప్రీం తీర్పు అభినందనీయం



ముఖ్యమంతి స్థాయిలో ఉండి తిరుమల లడ్డూ పై ఎటువంటి ఆధారాలు లేకుండా ఎలా మాట్లాడతారు. లడ్డు విషయాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలనుకున్నారు. చంద్రబాబు పాలన పై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ని డైవర్ట్ చేసేందుకు ఈ వివాదం తెర పైకి తెచ్చారని అందరికీ అర్ధమవుతోంది. సుప్రీం కోర్టు తీర్పు నిజంగా అభినందనీయం. సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ వేసి నిజానిజాలు నిగ్గ తేల్చాలన్న కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు వంటిది. ఈ తీర్పు ఆ వేంకటేశ్వరస్వామే వారిచేత చెప్పించి ఉంటారు.

– **బండి గోపాల్‌రెడ్డి**, ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

వాస్తవాలు వెలుగులోకి వస్తాయి



తిరుపతి లడ్డు వ్యవహారంపై సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల సిట్ బృందాన్ని వేయడం మంచి పరిణామం. సిట్ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కలియుగంలో పిలిస్తే పలికే దైవం వెంకటేశ్వరస్వామి. ఆయన విషయంలో తప్పు జరిగితే ఎంత గొప్ప వాడయినా శిక్షించబడటం ఖాయం. భగవంతుని నమ్మేవాళ్లు తమపై వచ్చే నిరాధార ఆరోపణలకు భయపడాల్సిన పనిలేదు. లడ్డు వ్యవహారం రాజకీయాలకు వేదిక కాకూడదు. తప్పు చేసిన వాడిని ఆ దేవదేవుడే శిక్షిస్తాడు. సత్యమేవ జయతే, ధర్మమేవ జయతే.

– **కొల్లూరు సత్యన్నారాయణ**, మేనేజింగ్ ట్రస్టీ, శ్రీ షిర్డిసాయిమందిర్, సింగరాయకొండ

సుప్రీం కోర్టు ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలిశాయి



తిరుమల వేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదంపై రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నేతలు చేసిన దుష్ప్రచారానికి సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో తెరపడింది. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వ నేతలందరూ వివిధ రకాల ప్రకటనలు గుప్పించి భక్తులను, ప్రజలను ఆందోళనకు గురిచేశారు. మొదటి నుంచి స్వామివారి లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కల్తీ జరగలేదని భక్తులు, టీటీడీ మాజీ చైర్మన్లు చెబుతున్నా కూటమి నేతలు తమ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారు. కల్తీ నెయ్యి వాడలేదని, సాక్షాత్తు టీటీడీ అధికారులు చెప్పినా కూటమి నేతలు ఒప్పుకోకుండా మాట్లాడారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో వాస్తవం ఏమిటో ప్రజలకు తెలిసింది. ఎవరూ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయరు. నాణ్యమైన నెయ్యినే వాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యలతోనైనా కూటమి నేతలు వాస్తవం గ్రహించాలి. సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వాస్తవాలు బయటకు వస్తాయి.

– **రెంటచింతల మధుసూధనశర్మ**, శ్రీ మార్కండేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్, మార్కాపురం

వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే లడ్డూ వివాదం



ఇచ్చిన హామీలు నెరవేర్చని తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూ అంశాన్ని వివాదం చేసి లబ్ధిపొందాలనుకుంది. జరగని తప్పును పదే పదే చెప్పిస్తూ అదే నిజం అని నిరూపించాలని చూసిన తెలుగుదేశం పార్టీకి సుప్రీం కోర్టు చురక లంటించడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన తిరుమల తిరుపతి దేవస్థాన ప్రతిష్టను తగ్గించేలా కూటమి నేతలు మాట్లాడుతుండటాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

– **నెమలిదిన్నె చెన్నారెడ్డి**, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కంభం

కల్తీ అంటూ కట్టుకథలు



తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. సాక్షాత్తు సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు దానిపై వ్యాఖ్యానించడం, ఉప ముఖ్యమంత్రి దానికి వంత పలకడం దారుణమైన అంశం. హిందువులలోనే కాకుండా అనేక మతాలకు చెందిన భక్తులు స్వామివారి అనుగ్రహం కోసం పరితపిస్తుంటారు. అటువంటి మహామాన్వితుని ప్రసాదంపై చేసిన వ్యాఖ్యలు ప్రతి ఒక్కరినీ తీవ్ర మనోవేదనకు గురిచేశాయి.

– **ఫణిదపు సుధాకర్**, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, ఒంగోలు

అత్యున్నత న్యాయస్థానం నిజాలు నిగ్గు తేలుస్తుంది



తిరుపతి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అయితే అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని నిజాలు నిగ్గ తేల్చాలని నిర్ణయించటం అభినందనీయం. నెయ్యిలో కల్తీ ఉందని ట్యాంకర్‌ను వెనక్కు పంపామని టీటీడీ అధికారి చెప్పటం, లేదు లేదు కల్తీ జరిగిందని ఆ లడ్డులను భక్తులు తీసుకున్నారని సీఎం చెప్పటంతో భక్తులు అయోమయంలో పడ్డారు. నెపం వైఎస్సార్ కాంగ్రెస్‌పై నెట్టాలని ప్రయత్నించారు. అయితే తప్పు జరిగిందా లేదా సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో కమిటీ తేలుస్తుందనే విశ్వాసం ఉంది.

– **యక్కలి శేషగిరిరావు**, నిర్మమహేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్, పొదిలి

క్లుప్తంగా

ఏకేయూలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు: ఎంబీఏ కోర్సులో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఈ నెల 4వ తేదీ నుంచి భర్తీ చేయనున్నట్లు ఏకేయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్ 2024లో అర్హత సాధించిన వారు మాత్రమే ఇందుకు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు అదేరోజు కోర్సు ఫీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం.. తమ కళాశాలలో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు అన్ని కేటగిరీలకు కేవలం రూ.400 మాత్రమేనని, ఈ నెల 7 నుంచి 9వ తేదీలోపు ఆలస్య రుసుం లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఆలస్య రుసుం రూ.100 కలిపి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 3 సెట్ల జెరాక్స్ ప్రతులు అందించాలన్నారు. కళాశాల సమయం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని చెప్పారు. తక్కువ ఫీజులతో పాటు కళాశాల ప్రాంగణంలో ఉచిత డిపార్ట్‌మెంట్ హాస్టల్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటిదాకా డిగ్రీ ప్రవేశాలు పొందని ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదనపు వివరాల కోసం 9494088747 నంబర్‌ను కళాశాల పని సమయాలలో సంప్రదించాలని తెలిపారు.

రెండోరోజు టెట్ పరీక్షలకు 63 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు రెండో రోజు పరీక్షలకు 63 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా నాలుగు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. సాయంత్రం సెషన్‌లో మాత్రమే ఈ పరీక్షలు జరగ్గా, 520 మందికిగానూ 457 మంది మాత్రమే హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి బి.సుభద్ర తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

● వ్యవసాయ కూలీకి తీవ్రగాయాలు


మృతి చెందిన ఎద్దుతో యజమాని గాలి నారాయణరెడ్డి

పెద్దదోర్నాల: పిడుగుపాటుకు ఓ ఎద్దు మృతి చెందగా, అదే సమయంలో పొలంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీకి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో గురువారం చోటుచేసుకోగా, శుక్రవారం వెలుగుచూసింది. ఈ సంఘటనలో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన వ్యవసాయ కూలీ రామానాయుడు తీవ్రంగా గాయపడగా, పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన గాలి నారాయణరెడ్డికి చెందిన ఎద్దు మృత్యువాతపడింది. గురువారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటున్న రామానాయుడు పొలం గట్టు మీద ఉన్న చెట్టు కిందకు చేరాడు. అదే సమయంలో పిడుగు పడటంతో తీవ్ర గాయాలపాలైన రామానాయుడు కోమాలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఎద్దు మృతి చెందింది. రామానాయుడును కర్నూలులోని వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని యజమాని గాలి నారాయణరెడ్డి వాపోయాడు.

ట్రాక్టర్ నుంచి పడి డ్రైవర్ మృతి


మరణించిన సామేలు

ఒంగోలు టౌన్: వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మీద నుంచి కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన స్థానిక కొప్పోలు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పేర్నమిట్ట శుభోదయ కాలనీకి చెందిన తేళ్ల సామేలు (28) కొప్పోలు నుంచి కొత్తపట్నం వైపునకు ట్రాక్టర్‌లో పేడ ఎరువు లోడుతో వెళ్తున్నాడు. శ్రుతిమించిన వేగం కారణంగా ట్రాక్టర్ మీద నుంచి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సామేలుకు భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితమే అశ్వినికి కాన్పు జరిగింది. సామేలు మరణంతో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


దర్శిలో మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ


ఒంగోలు కేశవస్వామిపేటలో కనకదుర్గమ్మకు మొక్కజొన్న కండెలతో అలంకరణ


కొమరోలు : రాజరాజేశ్వరిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


పెద్దదోర్నాలలో రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


ఒంగోలు కేశవస్వామిపేట విజయదుర్గాదేవి ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు

పామూరు వాసవీ మాత ఆలయంలో శివపార్వతుల నృత్య రూపకం



జగన్మాతా నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఊరూవాడా వేడుకగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం ఆలయాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులు, మూలవిగ్రహమూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


లాయర్‌పేట బాబా ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో రాజరాజేశ్వరిదేవి

పంచదార ఇస్తున్నాం.. పండగ చేస్కోండి!

'కూటమి అధికారంలోకి వచ్చేసింది. ఇక పేదలకు పండగే. ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార, కంది పప్పు, గోధుమ పిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది' అంటూ ఓ వైపు ఎల్లో మీడియా, మరో వైపు కూటమి నేతలు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. చంద్రబాబునాయుడు గద్దెనెక్కి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా రేషన్ సరుకుల పంపిణీపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్న తరుణంలో కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెట్టుకోవాలని చెప్పడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అక్టోబర్‌లోనూ రేషన్ లబ్ధిదారులకు అందని కందిపప్పు

- ఈ నెలలో బియ్యంతోపాటు పంచదార పంపిణీ
- రాగులు, జొన్నలు, గోధుమ పిండికి నాలుగు నెలలుగా కోత
- నాణ్యమైన బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం
- తీవ్ర స్థాయిలో లబ్ధిదారుల ఆగ్రహం
- ఓ వైపు మార్కెట్లో మండిపోతున్న నిత్యావసరాలు

పుల్లలచెరువు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రేషన్ సరుకుల్లో భారీగా కోత పెట్టింది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పిండి, రాగులు తదితర సరుకులు ఇంటి వద్దకు వచ్చి పంపిణీ చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలోని 1392 రేషన్ షాపుల పరిధిలో ఉన్న 6.70 లక్షల మంది లబ్ధిదారులకు కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయగా ఈ నెల కోటాలో బియ్యంతోపాటు పంచదారలను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. మార్కెట్ మిగిలిన వాటి ధరలు ఆకాశాన్నితాకుతున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏమయ్యాయి ఆ హామీలు?

ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను జనం నాలుగు నెలలుగా గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం, సరుకులను ఇంటికి వద్దకే అందించడాన్ని జీర్ణించుకోలేని కూటమి నాయకులు.. అక్రమాలు చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన సంగతి తెలిసిందే. పేదలకు ముఖ్యమైన సరుకులను ప్రతి నెలా ఠంచనుగా అందిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు పత్తా లేకపోవడంతో ఎవరిని ప్రశ్నించాలో తెలియక పేదలు అయోమయంలో పడ్డారు. ప్రతి నెలలోనూ వచ్చే నెల ఒకటి నుంచి అన్ని సరుకులు అంటూ ఊదరగొట్టడం, ఆ తర్వాత చేతులెత్తేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందంటూ లబ్ధిదారులు శాపనార్థాలు పెడుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి రూ.190 నుంచి రూ.210 వరకు విక్రయిస్తున్నారు. గోధుమ పిండి కిలో రూ.70 పలుకుతుండగా రాగులు, జొన్నల ధర కేజీ రూ.40గా ఉంది. గడిచిన నాలుగు నెలలుగా ప్రతి పది రోజులకోసారి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకుంటుందని భావించిన పేదలకు ప్రతి నెలా నిరాశే ఎదురవుతోంది.


రేషన్ బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎటుపోయాయి. పేదలకు బియ్యం మాత్రమే అందిస్తే సరిపోతుందా. కంది పప్పు ఇవ్వడం కనీస ప్రభుత్వ విధి. ఎన్నికల సమయంలో రేషన్ లబ్ధిదారులకు పంచదార, కందిపప్పు, గోధుమపండి, బియ్యం వద్దనుకుంటే రాగులు ఇస్తామని చెప్పారు. కానీ అవేవీ ఇవ్వకుండా కేవలం ప్రకటనలు చేయడం సరికాదు. బయట మార్కెట్‌లో సరుకుల ధరలు మండిపోతున్నాయి.

– జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి పుల్లలచెరువు

ఇసుక నిల్వలు మాయం


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

- వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుకను ఊడ్చేశారు
- సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ధ్వజం

ఒంగోలు టౌన్: ఎన్నికలకు ముందు ఉచితంగా ఇసుక ఇస్తామంటూ హామీ ఇచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలనలో రాష్ట్రంలో ఉన్న ఇసుక నిల్వలన్నింటినీ దోచుకుని మాయం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఉచిత ఇసుక ధర బంగారం ధరలా మండిపోతోందన్నారు. టన్ను ఇసుకను రూ.1,500 నుంచి రూ.2,500 వరకూ విక్రయిస్తున్నారన్నారు. అయినప్పటికీ ఇసుక దొరక్క బిల్డర్లు, గృహాలు నిర్మించుకుంటున్న యజమానులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్ర గనులు, భూగర్భ జలశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 190 ఇసుక రీచ్‌లను గుర్తించామని, 11 లక్షల టన్నుల ఇసుక అందుబాటులోకి తెస్తామని చెబుతున్న మాటలన్నీ ఒట్టివేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించగా, సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు పి.కల్పన, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పూసపాటి వెంకటారావు, షేక్ మాబు, మోజెస్, కేజీ మస్తాన్, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, బాలకోటయ్య, బి.రఘురాం, బంకా సుబ్బారావు, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శృతి మించిన 'కచేరీ'

● కంభంలో ఏడుగురు వ్యక్తులు బైండోవర్



కంభం: దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి కంభంలో ఏర్పాటు చేసిన పాట కచేరీలో నృత్యాలు శృతి మించాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన మహిళలు అక్కడి పరిస్థితి చూసి విస్తుపోయారు. ఆలయ సమీపంలో రికార్డింగ్ డ్యాన్సులు ఏమిటంటూ పలువురు పెద్దలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులైన ఏడుగురిని స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై నరసింహారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

21లోపు ఉపాధి పనులు చేపట్టాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన కొత్త పనులను ఈ నెల 14 నుంచి 21వ తేదీలోపు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలో ఉపాధి హామీ పథకంపై సమావేశం నిర్వహించారు. మంజూరైన కొత్త పనుల గ్రౌండింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేలా 935 కొత్త పనులకు రూ.11,026 లక్షలను గ్రామ సభల ద్వారా ఆమోదించడం జరిగిందన్నారు. ఆమోదం పొందిన మొత్తం పనులను పల్లె పండుగ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన తేదీల్లో ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రారంభించే పనులకు సంబంధించి ఏ రోజు ఏ పనికి శంకుస్థాపన చేయాలో షెడ్యూల్ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. చేపట్టే పనులను నాణ్యతతో నిర్దేశించిన గడువులో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. అందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రజలను కోరారు. స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సీపీఓ వెంకటేశ్వర్లుతో కలిసి వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, కమ్యూనికేషన్, పర్యాటకం, నీటిపారుదల, పరిశ్రమలు, మార్కెట్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా జిల్లాను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. హాజరైన ప్రతినిధులు మాట్లాడుతూ నీటి పారుదల వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం వలన చివరి ఆయకట్టుకు సైతం సాగునీరు అందించవచ్చన్నారు. తూర్పు వైపు ఉన్న సముద్రతీరం, గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులతో పాటు పశ్చిమ ప్రాంతంలోని ఎకోటూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలన్నారు.


ఉపాధి హామీ పథకంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొప్పోలు చెరువులో వ్యక్తి గల్లంతు


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: నగర శివారులోని కొప్పోలు చెరువులో స్నానానికి దిగిన వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... బీహారుకు చెందిన పంకజ్ సదా (29) ఒంగోలులోని రామకృష్ణ డెయిరీ ఫాంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఫాంకు చెందిన గేదెలను మేపడానికి చెరువు దగ్గరకు వెళ్లాడు. స్నానం చేయడానికి చెరువులోకి దిగాడు. చెరువులోకి దిగవద్దని స్థానికులు చెబుతున్నప్పటికీ వినిపించుకోలేదు. చెరువులోకి దిగి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక దళానికి చెందిన రెస్క్యూ టీంను పిలిపించారు. అప్పటికే చీకటి పడడంతో శనివారం ఉదయం గాలిస్తామని వారు వెళ్లిపోయారు. సదా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తాలూకా సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

మెరికల్లాంటి క్రీడాకారుల తయారీనే లక్ష్యం

● ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు

ఒంగోలు: నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో స్పోర్ట్స్ బోర్డు ద్వారా సుశిక్షితులైన క్రీడాకారులను తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం యూనివర్శిటీ పరంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ స్పోర్ట్స్ బోర్డు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ప్రొఫెసర్ల తోపాటు ఏకేయూ పరిధిలోని వివిధ కళాశాలల తరఫున బోర్డు సభ్యులుగా ఉన్న ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు, ఇతర యూనివర్సిటీలకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ విధానాలను పూర్తిగా అభివృద్ధి పరచడం, ఇంటర్ వర్శిటీ టోర్నమెంట్స్, ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్స్, ఖేలో ఇండియా నిర్వహణ, ఆటల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు అదనపు మార్కులు ఇవ్వడం తదితర అంశాలపై చర్చించారు. ప్రత్యేక ఆహ్వానితులు వెంకటేశ్వర వర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివ శంకర్ రెడ్డి, యోగి వేమన వర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కే.రామ సుబ్బారెడ్డి, జేఎన్‌టీయూ కాకినాడ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్యామ్ కుమార్ పలు విషయాలను ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్ రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర, కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ బీ రమేష్ బాబు, చీరాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.మురళి, ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్, సమావేశ కార్యదర్శి డాక్టర్ ఐ.దేవీ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం అటవీశాఖ డీడీగా సందీప్ కృపాకర్

● విగ్నేష్ అప్పావ్ అనంతపురానికి బదిలీ


సందీప్ కృపాకర్

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నెల్లూరు ఏపీఎఫ్‌డీసీలో రీజినల్ మేనేజర్ గా పని చేస్తున్న జి.సందీప్ కృపాకర్ ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన విగ్నేష్ అప్పావ్ అనంతపురం డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు. సందీప్ కృపాకర్ 2016 ఐఎఫ్ఎస్ అధికారి.

ఇదెక్కడి సంత బేరం?

- రెసిడెన్స్ సర్టిఫికెట్‌కు రూ.500 ఇవ్వాలా?
- తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ నేతల నిరసన


తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న అల్లాభక్షు

తర్లుపాడు: ఆ తహసీల్దార్‌ను టీడీపీ నేతలు కోరి తెచ్చుకున్నారు. తాము చెప్పిన పనులు చేస్తాడని అనుకున్నారు. ఏమైందో తెలియదు కానీ.. క్యాస్ట్, ఇన్‌కం, రెసిడెన్సీ సర్టిఫికెట్లకు కూడా డబ్బు అడుగుతున్నాడంటూ ఆందోళనకు దిగారు. బాధితుడి కథనం ప్రకారం.. తర్లుపాడుకు చెందిన అల్లాభక్షు తన కుమార్తెకు రెసిడెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. 10 రోజులైనా సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి ప్రశ్నించాడు. 'రూ.500 ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తామనడమేంటి' అంటూ గట్టిగా కేకలు వేశాడు. దీంతో తహసీల్దార్ వెంటనే సీట్లో నుంచి లేచి గట్టిగా మాట్లాడొద్దని చెప్పాడు. అల్లాభక్షు తనలాంటి బాధితులతో కలిసి రెవెన్యూకార్యాలయం ఎదుట తహసీల్దార్ డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేశాడు. ఈ సంఘటన రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్‌ను మార్కాపురం సబ్‌కలెక్టర్ పిలిపించి మాట్లాడినట్టు సమాచారం.